మేళం వస్తే చూడ్డానికెళ్ళి వంటింట్లో పొయ్యి మీద గిన్నె గురించి మర్చిపోతూ వుంటాను. దీనికేమంటారు' అని.

మా వదినగారి మొగుడు 'చూడు అమ్మీ-యవ్వనం వెళ్ళిపోతూ నీకు మతిమరుపు లాటి చిన్న చిన్న అమర్యాదల్ని అంటగట్టి వెళ్ళి పోతోంది' అంటే ఆవిడ ఖస్సుమందిట -

'చిన్నప్పుడు పరికిణీలు వల్లెవాటుల్లోంచి పవిటల్లోకొచ్చినపుడు యిలాగే చిల్లరమల్లర పనులన్నీ మర్చిపోవడమో పరధ్యాసవల్ల పాడవడమో జరుగుతూండేది కదా దానికేమంటారు జానకీ వల్లభా' అందిట.

అప్పుడాయన నవ్వి 'యవ్వనం వచ్చినపుడూ వెళ్ళిపోయినపుడూ కూడా ఒకేరకం వికారాల్ని తెస్తుంది సుమా జానకీ' అని నవ్వారట.

ఆవిడ తెల్లబోయి బుగ్గన చేయి ఆనించుకుని నిలబడిపోయింది. సో వాట్!

# తెలుగుగోల

రైళ్ళలో కాని బస్సులలో కాని ప్రయాణం చేస్తున్నపుడు మనకి ఒక రకమైన మాటలు వద్దన్నా వినిపిస్తూ వుంటాయి. ఏ రైల్వే ప్లాట్‌ఫారం మీదైనా సరే - అర్టిపళ్ళను అరిటీపళ్ళనీ, చక్రకేళీలనీ పిలవకుండా 'కేలా' 'కేలా' 'కేలా' అని అరుస్తూ వుంటాడు అరిటిపళ్ళమ్మేవాడు. అరిటిపండుని అరిటిపండని పిలవడానికి సిగ్గుపడే జాతి మనది. శుభ్రంగా త్రిమూర్తుల్లా కిళ్లీ, బీడీ, సిగరెట్ అని వుండగా 'పాన్ బీడా' 'పాన్‌బీడా' 'పాన్‌బీడా' అని అరుస్తాడు. అన్నిటి కంటె విచిత్రం ఏవిటంటే - శుభ్రమైన మామిడి తాండ్రని పట్టుకుని - తాండ్ర - తాండ్ర - తాండ్ర అని తాండ్ర పాపారాయుళ్ళా గర్వంగా అరవక ఆంగ్లో ఇండియన్‌లా 'మేంగో జెల్లీ - మేంగో జెల్లీ' అని అరుస్తాడు వాల్తేరు - విజయవాడ లైన్లో యించుమించు తుని - సామర్లకోటల వద్ద. అసలు మామిడి తాండ్ర పోసేదే గోదావరి జిల్లాల్లో - అక్కడ రైల్లో మాత్రం మామిడి తాండ్ర అంటే నామోషి వస్తుంది కాబోలు! 'మేంగో జెల్లీ' అన్నవాడ్ని పిలిచి పూచి పుచ్చుకు ఓ జెల్ల కొట్టాలి దిమ్మతిరిగేలా.

రైళ్ళలో 'పాలు-పాలు' అని నోరారా పిలవకుండా 'దూద్-దూద్' అని అంటాడు పాలమ్మే కుర్రాడు లేదా మిల్క్.

జీడిపప్పు అమ్మేవాడు జీడిపప్పు అని కేకెయ్యాలి. కాని, వాడు 'కాజా-కాజా' అంటాడు జీడిపప్పు అంటే స్టేటస్ భంగం అయిపోతున్నట్లు ఫీలయి.

ఇక భోజనం టిక్కెట్లమ్మేవాడు - చర్మంలాటి ఉదా బూడిదరంగు కోటు ధరించి - ఆ కోటుని వాడ్ని చూస్తే అన్నం సయించదు, వాంతి వెళ్ళిపోతుంది - వాడిక్కూడా తెలుగు భాష

అంటే చిన్నచూపే - 'మీల్సు-మీల్సు-మీల్సు' అని చెవి కోసిన మేకలా అరుస్తాడు. తప్పితే 'ఖానా-ఖానా' అంటాడు. ఇంకా దయతలిస్తే 'సాపాటు' అంటాడు గాని ఛస్తే 'భోజనం' అన్డు. రైలు ప్రయాణాల్లో వెండార్సు ఉభయభాషా ప్రవీణులూ, బహు భాషా కోవిదులూ అయి వుండాలని మావారు అన్నారు. ముష్టివాళ్ళు సైతం పరభాషల్లో యాచన చెయ్యాల్సి వస్తున్నది. బెగ్గర్స్ ఆర్ గుడ్ లింగ్విస్టులు-ఆ మాట ఒప్పుకుంటాం-కోడిగుడ్లని కోడిగుడ్లనకుండా 'అండా' - వాడి పిండాకూడు-అండా ఏవిటి రండలాగ (లేకపోతే బాయిల్డ్ ఎగ్ అంటాడు వుడకబెట్టిన క్రోడి గుడ్డు అనకుండా). కోడిని గ్రాంధికం చేస్తే క్రోడి అవుతుందేమో డాక్టర్ చేకూరి రామారావుగారి నడగాలి.

మరో మాయరోగం మనవాళ్ళకి - 'ఫల్లి-ఫల్లి-ఫల్లి' లేదా 'మూఫల్లి' అని అరుస్తారు బుట్టల్ని లాగిస్తూ. 'గరమ్- గరమ్ -ఖారా గరమ్ గరమ్ మూఫల్లి' అంటాడు. 'కారా-సాదా' అంటాడు. ఛస్తే వాడి చెవులు కోసినా 'వేరు సెనగపప్పు - వేరుసెనక్కాయలు సెనక్కాయలు వేడి వేడి సెనక్కాయలు' అని అన్డుగాక అన్డు. 'వేరు సెనగ పలుకులు అనీ వేరుసెనగ గుళ్ళు' అనీ అన్లేడు. వాడి నాలుక వెనక్కు వెళ్ళిపోతుంది. ప్లాట్‌ఫారం మీద 'ఇడ్లీ వడ దోసై' అంటాడు గాని 'గారె' పేరు వినపడదు. వడ అంటాడు మసాలా వడ అంటాడు గారె అని అనడు - గారెకు స్థానం లేకుండా చేశారు చిరుతిళ్ళలో.

'ఆవడ' అని వుందనుకోండి. ఆవడ అంటే ఏ హోటలువాడికీ తెలీదు. గ్రీకో లాటినో అన్నట్లు మొహం పెడ్తాడు. పెరుగు వడ అని కూడా అంటే వినిపించుకోడు. మీరు 'దహీవడ' అని 'తైరువడ' అని అంటే గాని సర్వుజేసేవాడి ముఖం వికసించదు.

ఇక మనవాళ్ళు బోయినాల దగ్గర మీల్సుతో ప్రారంభించి - అరటికాయ కూర, వంకాయకూర, బంగాళదుంపకూర అని నోరార రామనామం జపించినట్లు అనలేరు - బైంగన్ అంటాడు, ఆలూ అంటాడు మేటర్‌ఫల్లి అంటాడు సాంబార్రంటాడు రసం అంటాడు చట్నీ అంటాడు కాని పచ్చడి అన్లేడు, కూర వెయ్యమ్మా అనినోరారా అడగలేడు - వంకాయకూర, బంగాళదుంపల కూర అంటే వీడి పరువేమన్నా గంగలో కలుస్తుందా? వీడి పిల్లనెవరూ చేసుకోరా? వాడి పెళ్ళాం కాపరం చెయ్యనందా? 'కర్రీ' అంటే గాని వాడికి ఒళ్ళు పులకరించడం లేదు. వింటున్నారా అన్నగారూ! ఈ తెలుగూస్‌కి నోటిమీద వాతలు పెట్టించండి - తల్లిభాషలో మాట్లాడ్డానికి సిగ్గిలే దుర్మదాంధుల్ని, పులుసన్నా అంటే గ్రావీ అంటాడు. పులుసులో ముక్కలు వెయ్యమని అడగడానికి కొంచెం సాఫ్ట్ పీసెస్ సెలక్ట్ చేసి వెయ్యమ్మా అంటాడు.

ముష్టివాడు కొంచెం రైస్ వెయ్యమ్మా అనడు. 'అన్నం పెట్టు తల్లీ' అంటాడు నోరారా. మన యింటింటి హీరోగారు, 'రైస్ యిలా అందుకో-కర్రీ యిటు జరుపు-చట్నీ కాస్త రుబ్బు - ఘీ వుందా-పాపడ్ మరోటి, వడ్డించమను' - 'కూరేవిటి బ్రింజాల్సా, కరేళానా-' యిలా సాగిస్తాడు కాని 'తేనెపోక నోరు తీయన యగురీతి-' అన్నం అందుకోమనడు, కూర వంకాయా కాకరకాయా అనడు, మేంగోస్ అంటాడు కాని మామిడిపండు అన్లేడు, నెయ్యి పాలు

పెరుగు,పెరుగంటే జ్ఞాపకం వచ్చింది. కర్డుందా అంటాడు పాల్ అంటాడు. వూరగాయ అని అనకుండా పికిల్సు- పికిల్సు అని ఏడుస్తాడు. కారం ఎక్కువయితే చిల్లీస్ ఎక్కువయిందని అఘోరిస్తాడు. అన్నగారూ-భోజనం దగ్గర యింగ్లీషు మాట్లాడేవాడి మూతిపళ్ళు రాలగొట్టాలని అసెంబ్లీలో వో బిల్లు ప్యాస్ చేయించండి.

పట్టుచీరకి సిల్క్ శారీ అని బ్లవుజ్ పీస్‌కి రవికల గుడ్డ అని అనలేని స్థితికి మనం దిగజారిపోతున్నాం. రుమాలు అనడం మానేసి హాంకీ అంటున్నారు.

పెళ్ళి నిర్ణయం అయిందా అనడక్కుండా మేరేజి సెటిలయిందా అంటున్నారు నేటి నవయువక్స్.

మరి ఈ దేశాన్ని బాగుచెయ్యలేం అని ఆత్మహత్య చేసుకుంటారా లేక హత్యలు చేస్తారా? మీరే నిర్ణయించుకోవాలి!

# రోడ్లకు నా రెడ్ శాల్యూట్!

మీరెప్పుడేనా రోడ్డుకేసి చూశారా? నా మొహం ఎందుకు చూడరూ - వీధి మొహం ఎరగని వాళ్ళని ఆడాళ్ళలో కొన్ని శాల్తీలు పూర్వంవుండే వాళ్ళుగాని యిప్పుడంతా వీధిమొహా లెరుగున్నవాళ్ళే - కవులు రోడ్డెక్కుతారు. ఇంట్లో కూచుంటే మాకేం అక్కర్లేదు కాని వీధిలోకొస్తే ఏవన్నా అంటాం....టాం...టాం అని కొందరు బెదిరిస్తారుగాని - మనిషి రోడ్డున పడకుండా అతని బతుకు వెళ్ళమారదు. పూర్వం రైళ్ళలో "లుగళ బారదు" 32 జనులు కూర్చుండేది. దొంగలున్నారు జాగ్రత్త అని రాసేవారు. బస్సులవాళ్ళు రైళ్ళవాళ్ళ కంటె ఆస్తికులు, దైవచింత, పాపభీతి, బస్సులవాళ్ళకే ఎక్కువ, చేతులు బయటపెట్టరాదు, చిల్లర తెచ్చుకోవలెను లాటి షరతులతో పాటు భగవంతుని స్మరింపుము. స్త్రీలు అని కూడా రాస్తారు. బస్సులలో స్త్రీలు మాత్రమే భగవంతుని గుర్తుచేసుకోవాలని రాయడంలో ఎంతో ఔచిత్యం నాకు కనిపిస్తోంది. దేవుడెప్పుడూ వంటింట్లోనే వుంటాడు కిచెన్ గార్డ్‌లా. పొయ్యిదగ్గిర నిప్పుతో నీళ్ళతో చెలగాటమాడే పువుబోళ్ళకు గాడ్స్ గ్రేస్ వుండాలిగాని ముందు గదిలోని మందభాగ్యులకు దేవునితో పనియేమి? దేవుడెప్పుడూ పిల్లలలోనూ ఆడవాళ్ళలోనూ వుంటాడు.

ఏ రోడ్డు చరిత్ర చూచినా ఏమున్నది గర్వకారణం అని ఓ పేరడీ రచయిత అన్నప్పటికీ మరో ఆధునిక కవి రోడ్లకు నమస్కారం అనేశాడు. నమస్కారం అన్న వాడిమాట వినాలా, గర్వకారణం ఏమున్నది అన్నవాడిమాట వినాలా? మీకు నమస్కారం చేస్తున్నారంటే అది పూజనీయం అనేకదా మీనింగ్. మీరు కనిపెట్టారో లేదో రోడ్డు ఎక్కడికీ వెళ్ళదు; చక్కెరకు తన తీపి తనకు తెలియనట్లు గొప్పవారికి తమవిశేషం తమకు స్పృహలో వుండదు. అడవిలో